అన్నదాతకు ఈ-క్రాప్ అండ

- పంటల సాగు నమోదుతో మేలు
- ఉచితంగా బీమా సదుపాయం
- ప్రకృతి వైపరీత్యాల సమయంలో పరిహారం



ఈ-క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయాధికారులు

బత్తలపల్లి: రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటోంది. విత్తనాల దగ్గర నుంచి.. వారికి అవసరమైన ఎరువులు, పురుగు మందులు, రుణాలు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు నష్టపోయిన ప్రతి రైతుకు బీమా సాయం అందించేందుకు ప్రణాళికలు అమలు చేస్తోంది. వీటన్నింటినీ కాలానుగుణంగా ముందుకు తీసుకెళ్లేందుకు.. గ్రామ సచివాలయ పరిధిలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ఈ-క్రాప్ పద్ధతిని అమలు చేస్తున్నారు.

ఆన్‌లైన్‌లో నమోదు

ప్రతి రెవెన్యూ గ్రామంలో రైతులకు సంబంధించిన పూర్తి వివరాలు ఈ-క్రాప్‌లో అధికారులు నమోదు చేస్తున్నారు. పంట ప్రారంభంలో తాము సాగు చేస్తున్న పంట, బ్యాంకు ఖాతా నంబర్, ఆధార్‌కార్డు, సర్వే నంబర్లు తదితర వివరాలను ఈ-క్రాప్ యాప్‌లో నమోదు చేస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పంట బీమా పథకం వర్తిస్తుంది. అలాగే ప్రభుత్వం అందించే వడ్డీ లేని పంట రుణాల పథకం ద్వారా రుణాలు పొందే అవకాశం ఉంటుంది. ప్రకృతి వైపరీత్యాల సమయంలో నష్ట పరిహారాలతో పాటు ఇతర సదుపాయాలు సైతం అందుతాయి. అందువల్ల రైతులు తప్పనిసరిగా గ్రామ వలంటీర్ ద్వారా తమ భూముల వివరాలు ఈ-క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

పంట ఆధారంగా పరిహారం...

ఈ-క్రాప్‌లో ముందుగానే ఆయా సర్వే నంబర్ల వారీగా పంట వివరాలు నమోదు చేయటం వల్ల.. ప్రకృతి విపత్తుల సమయంలో పంట ఆధారంగా పరిహారం పొందే అవకాశం ఉంటుంది. రైతులు తమ పొలాల్లో మొక్కజొన్న, కూరగాయలు తదితర వాణిజ్య పంటలు పండిస్తే.. వాటికి ప్రత్యేకంగా పరిహారం జమ చేస్తారు. వరి పండిస్తే దానికనుగుణంగా ప్రభుత్వం పరిహారం జమ చేస్తుంది. ఈ-క్రాప్ చేయటం వల్ల ఆయా వివరాలు యాప్‌లో నమోదు చేసి ఉంటాయి.

రైతులకు ప్రయోజనం



ఈ-క్రాప్ విధానంలో భూముల వివరాలను ప్రభుత్వం ఆన్‌లైన్‌లో ఉంచుతుంది. దీనివల్ల సాగు చేస్తున్న భూముల్లో నూతన యాజమాన్య పద్ధతులపై ఎప్పటికప్పుడు సలహాలు పొందవచ్చు. ప్రభుత్వం అందించే రాయితీలు పొందాలంటే ఈ-క్రాప్ చేయించుకోవాలి. ఏటా ఈ విధానం అమలుతో భూములు కొనుగోలు చేసిన రైతులకు కూడా ప్రయోజనం.

–బొమ్మా ఓంప్రసాద్‌రెడ్డి, రైతు, కాటమకుంట, బత్తలపల్లి మండలం

సీఎం జగన్ రైతు పక్షపాతి..



గత ప్రభుత్వాలు పంటల బీమా చెల్లింపులోనే నిర్లక్ష్యం చేసేవి. ఈ-క్రాప్ విధానం ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత పంట వివరాలను పూర్తిగా ఆన్‌లైన్ చేస్తున్నారు. దీనివల్ల చదువు రాని రైతులకు కూడా అవగాహనను ప్రభుత్వం కల్పించింది. ఈ నిర్ణయం చాలా బాగుంది. సీఎం వైఎస్ జగన్ రైతు పక్షపాతిగా నిలుస్తారు.

–గుజ్జల మునలయ్య, రైతు, డి.చెర్లోపల్లి, బత్తలపల్లి మండలం

ఏటా నమోదు..



ఈ-క్రాప్ వివరాలు ఏటా వ్యవసాయాధికారులు నమోదు చేయాలి. దీని వల్ల ఆ ఏడాదిలో కొత్తగా భూములు కొనుగోలు చేసుకున్న రైతులకు కూడా ప్రయోజనం పొందొచ్చు. ఆర్బీకేల్లో గ్రామ వ్యవసాయ అసిస్టెంట్లు పంటలు నమోదు చేస్తారు. రబీ రైతులు ఈ నెల 15వ తేదీలోపు ఈ-క్రాప్‌లో నమోదు చేయించుకోవాలి.

–ఓబిరెడ్డి, వ్యవసాయాధికారి, బత్తలపల్లి

ఈ క్రాప్‌లో నమోదైన వివరాలు ఇలా....
(ఎకరాల్లో–09-02-2024 నాటికి)

అమడగూరు	1,790.39
ఓబులదేవరచెరువు	1,632.48
కదిరి	2,431.44
కనగానపల్లి	1,317.11
కొత్తచెరువు	3,943.70
గాండ్లపెంట	687.84
చెన్నేకొత్తపల్లి	1,070.82
తనకల్లు	3,238.11
తలుపుల	3,955.39
తాడిమర్రి	2,227.28
ధర్మవరం	2,218.34
నల్లచెరువు	1,695.40
నల్లమాడ	2,611.66
నంబులపూలకుంట	3,983.95
పుట్టపర్తి	1,551.84
బత్తలపల్లి	1,155.88
బుక్కపట్నం	2,884.36
ముదిగుబ్బ	2,865.54

పండ్లు, బ్రెడ్డు పంపిణీ



రోగులకు పండ్లు, బ్రెడ్డు అందిస్తున్న నాయకులు

ధర్మవరం అర్బన్: పీఆర్‌టీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు బుక్కచెర్ల రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. అనంతరం రిటైర్డ్ హెచ్‌ఎం, పీఆర్‌టీయూ నేత చలపతిని శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకులు సి.రామకృష్ణారెడ్డి, జిల్లా నాయకులు విజయ్‌కుమార్, ధర్మవరం అధ్యక్షుడు శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, నాయకులు రామయ్య, రామ్మోహన్‌రెడ్డి, చంద్రమౌళిరెడ్డి, ఓబిరెడ్డి, చిదంబర్‌రెడ్డి, సంజీవరెడ్డి, సుగుణమ్మ పాల్గొన్నారు.

ఎరువులు అందించండి

గాండ్లపెంట: అర్హులైన రైతులకు ఎరువులు అందించాలని మండల వ్యవసాయ సలహా సంఘం సలహా అధ్యక్షుడు వైవీ శంకర్‌నాయుడు అధికారులకు సూచించారు. శుక్రవారం స్థానిక వ్యవసాయాధికారి కార్యాలయంలో చైర్మన్ ఆధ్వర్యంలో వ్యవసాయ సలహా సంఘం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి రైతుకు రైతు భరోసా, పీఎం కిసాన్ అందేలా చూడాలని సూచించారు. సలహా మండలి సభ్యులు లోకేశ్వరరెడ్డి, మార్కెట్‌యార్డు డైరెక్టర్ పుల్లారెడ్డి, ఏడీఏ సత్యనారాయణ, ఏఓ లక్ష్మీప్రియ, వీఏఏ పాల్గొన్నారు.

నూతనకాల్వకు బస్సు నడపాలి

తలుపుల: నూతనకాల్వ గ్రామంలోకి ఆర్టీసీ బస్సు నడపాలని కోరుతూ గ్రామస్తులు శుక్రవారం ఆర్టీసీ బస్సు ముందు నిరసన వ్యక్తం చేశారు. బస్సు కోసం కదిరి డిపో మేనేజర్‌కు వినతి పత్రం అందజేసి 2 నెలలు అవుతున్నా పట్టించుకోలేదని వారు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు తమ గ్రామానికి బస్సు వచ్చేలా చూడాలని కోరారు.

క్లుప్తంగా

అయోధ్య రథయాత్ర



గంగిరెడ్డిపల్లిలో ఊరేగుతున్న అయోధ్య రథం

అమడగూరు: తుమ్మల, చీకిరేవులపల్లి, చినగానిపల్లి, కస్సముద్రం, మహమ్మదాబాద్, జేకేపల్లి గ్రామ పంచాయతీల్లో శుక్రవారం అయోధ్య రథయాత్ర ఊరేగింపు సాగింది. ఆయా గ్రామాల్లోని మహిళలు పెద్దెత్తున కొబ్బరికాయలను సమర్పించి పూజలు చేశారు. ఈ నెల 20 వరకూ కదిరి డివిజన్‌లోని అన్ని మండలాల్లో ఊరేగింపు నిర్వహించి 21 వ తేదీన కదిరిలో శ్రీ సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. నిర్వాహకులు బొట్టుస్వామి, ఆదినారాయణరెడ్డి, రాము, శ్రీనివాసులు, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

మక్బూల్‌ను కలిసిన సున్నపుగుట్టతండావాసులు



బీఎస్ మక్బూల్ అహ్మద్‌ను కలిసిన సున్నపుగుట్టతండా ప్రజలు

కదిరి అర్బన్: వైఎస్సార్‌సీపీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్‌ను శుక్రవారం సున్నపుగుట్టతండాకు చెందిన 200 మంది ప్రజలు కలిశారు. పార్టీ అంటే తమకు ఎనలేని అభిమానమని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి భారీ మెజారిటీతో గెలిపిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి మహ్మద్ షాకీర్, సున్నపుగుట్టతండా వైఎస్సార్‌సీపీ నాయకులు నవాజ్, వెంకటేష్ నాయక్, చలపతినాయక్ పలువురు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక



కొండయ్యకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీఎస్ మగ్బూల్ అహమ్మద్

గాండ్లపెంట: మలమీదపల్లి పంచాయతీకి చెందిన టీడీపీ వీరాభిమాని పి.కొండయ్య శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరాడు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహమ్మద్ ఆధ్వర్యంలో పార్టీలో చేరాడు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనను నచ్చి వైఎస్సార్‌సీపీలో చేరినట్లు కొండయ్య తెలిపాడు. స్థానిక నాయకులు అమానుల్లా, హరినాథ్‌రెడ్డి, అమీర్‌ఖాన్, రామకృష్ణ, పురుషోత్తంరెడ్డి, మల్లిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

ధర్మవరం రూరల్: గొట్లూరు వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓవ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు..మల్కాపురం గ్రామానికి చెందిన వెంకటేష్ పని నిమిత్తం బైక్‌పై ధర్మవరం బయలుదేరాడు. గొట్లూరు వద్ద పెట్రోలు కొట్టించుకొని రోడ్డు దాటుతుండగా కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురం తీసుకెళ్లారు.

ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం

గాండ్లపెంట: మండలంలో ప్రభుత్వ ఇంటి లబ్ధిదారుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను రెవెన్యూ సిబ్బంది వేగవంతం చేశారు. శుక్రవారం నాటికి మండల వ్యాప్తంగా 171 మందికి రిజిస్ట్రేషన్లు పూర్తి చేశారు. ఇంకా 39 మందికి చేయాల్సి ఉండగా వారిలో కొంత మంది మరణించగా, కొంతమంది అందుబాటులో లేరని రెవెన్యూ సిబ్బంది తెలిపారు.

బహుమతుల అందజేత



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న హరిమోహన్

కదిరి అర్బన్: మొటుకుపల్లి ఆర్టీటీ కేంద్రంలో చదువుతున్న విద్యార్థులకు సైన్స్, ఇంగ్లిష్, మ్యాథమాటిక్స్ పాఠ్యాంశాలపై క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ హరిమోహన్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ శాంతమ్మ, ఆర్గనైజర్ మురళీ,సెక్టార్ టీం లీడర్లు కేశవమూర్తితో పాటు పలువురు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు పూజలు

రామగిరి: నసనకోట సమీపంలో ఉన్న ముత్యాలమ్మ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. ఉదయాన్నే అమ్మవారిని వివిధ రంగుల పూలతో అలంకరించారు. ఉమ్మడి జిల్లా, కర్ణాటకలోని వివిధ ప్రాంతాల భక్తులు తరలి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

పిల్లల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా పని చేయాలి



కనగానపల్లిలో ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది



తాడిమర్రి మండలం నార్శింపల్లిలో కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సెల్వియా సాల్మన్



గాండ్లపెంట: కటారుపల్లి కస్తూర్బా పాఠశాలలో బాలికలకు ఆల్‌బెండజోల్ మాత్రలను వేస్తున్న ఎంపీపీ తాతం జగన్మోహన్

తాడిమర్రి: చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా పని చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సెల్వియా సాల్మన్ వైద్య సిబ్బందికి సూచించారు. మండలంలోని గ్రామాల్లో శుక్రవారం జరిగిన విద్యార్థులకు ఆల్బెండజోల్ పంపిణీ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలు ఆడుకోవడం, భోజనానికి ముందు సక్రమంగా చేతులను శుభ్రం చేసుకోకపోవడంతో వారి కడుపులో నులిపురుగులు పడుతాయన్నారు. దీంతో పిల్లల్లో రక్తహీనత ఏర్పడి ఎదుగుదల తగ్గిపోతుందన్నారు. ఆల్బెండజోల్ మాత్రలు వేయడంతో వారి కడుపులోని నులిపురుగులు పడి పోయి ఆరోగ్యంగా ఉంటారని ఆమె తెలిపారు. మండలంలో 4,624 మందికిగాను 4000 మందికి వేసినట్లు వైద్యాధికారి హరిత తెలిపారు. సీహెచ్‌ఓ హేమలత, ఎంపీహెచ్ ఈఓలు రామ్‌కుమార్, నారాయణమ్మ, పీహెచ్‌ఎన్ లక్ష్మీదేవి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బత్తలపల్లి: రక్తహీనత నివారణకు విద్యార్థులు తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవాలని బత్తలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు గంగిరెడ్డి, రామకృష్ణ అన్నారు. శుక్రవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా బత్తలపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, సంజీవపురం కేజీబీవీ విద్యాలయం, డి.చెర్లోపల్లి ప్రాథమిక పాఠశాలలో వారి సమక్షంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. మండలంలో 6,090 మంది చిన్నారులకు గాను 5,877 మంది చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించి 97 శాతం లక్ష్యానికి చేరుకున్నట్లు వారు తెలిపారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

తలుపుల: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా కేజీబీవీలో ఎస్‌ఓ మోహనమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యాధికారులు అబ్బాస్,ఆశ్రిత విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా 6,831కి గాను 6,215 మంది విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేసినట్లు వైద్యాధికారులు తెలిపారు. కదిరి ఏరియా కదిరి మలేరియా సబ్ యూనిట్ అధికారులు మహబూబ్ బాషా, రామ్మోహన్, హెల్త్ సూపర్‌వైజర్ ప్రభాకర్, జయరాజారావు పాల్గొన్నారు.

తనకల్లు: మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు శుక్రవారం ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఓడీచెరువు: మండలంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు శుక్రవారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. మొత్తం 9,970 మందికి 9,810 మందికి పంపిణీ చేసినట్లు వైద్యాధికారి కమల్‌రోహిత్ తెలిపారు.

నల్లమాడ: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు మండల వైద్యాధికారి డాక్టర్ గణేనాయక్, సీహెచ్‌ఓ రామాంజులు తెలిపారు. మండలంలోని 7,729 పిల్లలకుగాను తొలిరోజు 7,459 మందికి పంపిణీ చేశామన్నారు.

గాండ్లపెంట: మండల వ్యాప్తంగా 98 శాతం విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రలను పంపిణీ చేసినట్లు శుక్రవారం వైద్యాధికారి బాబాఫక్రుద్దీన్ తెలిపారు. మండలంలో తొలిరోజు 4,778 మందికిగాను 4,708 మంది పిల్లలకు మాత్రలు వేశామన్నారు. కటారుపల్లి కస్తూరిబా బాలికల పాఠశాలలో ఎంపీపీ తాతం జగన్మోహన్ చేతుల మీదుగా విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. పాఠశాల ఎస్‌ఓ దుర్గా, సూపర్‌వైజర్ ఉపేంద్రారెడ్డి, హెచ్‌ఈ విజయ్‌కుమార్, ఏఎన్‌ఎం రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

కనగానపల్లి: ఆల్బెండజోల్ మాత్రల ద్వారా నులి పురుగులను నివారించొచ్చని పీహెచ్‌సీ డాక్టర్ చెన్నారెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని 53 అంగన్‌వాడీ కేంద్రాలు, 47 పాఠశాలలు, 2 కళాశాలల్లోని 6,233 మంది విద్యార్థులకు ఆరోగ్య సిబ్బంది ఆల్బెండజోల్ మాత్రలు వేశారు.

జనం బాగుండాలంటే జగన్ సీఎం కావాలి



ఎమ్మెల్యే కేతిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలోచేరిన టీడీపీ కార్యకర్తలు, సానుభూతిపరులు

- ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి
- 55 టీడీపీ కుటుంబాలు వైఎస్సార్‌సీపీలోకి చేరిక

ధర్మవరం: జనం బాగుండాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో శుక్రవారం 8వవార్డు కౌన్సిలర్ బ్రహ్మయ్య ఆధ్వర్యంలో కేశవనగర్‌కు చెందిన టీడీపీ కార్యకర్తలు, సానుభూతిపరులు 55 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. ఎమ్మెల్యే వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం చేనేతలకు వెయ్యి రూపాయల కోసం ఎన్నో ధర్నాలు చేసినా పెంచలేదన్నారు. అయితే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఒక్క ధర్మవరం నియోజకవర్గంలోనే 15వేల కుటుంబాలకు 5 విడతలుగా ఒక్కో కుటుంబానికి రూ.24 వేలు చొప్పున నేతన్న నేస్తం డబ్బులు పడ్డాయన్నారు. ఇందులో టీడీపీ వారు ఉన్నారన్నారు. గతంలో పట్టణవాసులు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడేవారని, ఇప్పుడు ప్రతి ఇంటికీ కుళాయిలు ఏర్పాటు చేసి తాగునీరు సరఫరా చేస్తున్నామన్నారు. ఎన్నికల హామీలను 99 అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. టీడీపీ హయాంలో కేవలం ఇద్దరు, ముగ్గురు నాయకులు మాత్రమే సంపాదించుకునేవాళ్లని, ఇప్పుడు ఒక్కో వార్డులో రూ.కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యాక్రమాలు జరుగుతున్నాయన్నారు. కేశవనగర్‌లో రూ.31 కోట్లు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించామని గుర్తు చేశారు.

20 రోజులకే పార్టీ మారిపోయాడు...

వరదాపురం సూరి గత ఎన్నికల్లో ఓడిపోయిన 20 రోజులకే టీడీపీని వీడి బీజేపీకి మారిపోయాడని ఎమ్మెల్యే కేతిరెడ్డి పేర్కొన్నారు. ఇప్పుడేమో రూ.100 కోట్లు ఇచ్చి సీటు కొనుక్కుంటాడంటా అంటూ ఎద్దేవా చేశారు. జనాలు, వారి బాధలు పట్టించుకోకుండా కేవలం డబ్బులతో సీట్లు కొనుక్కునే నాయకులు తయారయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ వాళ్లు గతంలో ధర్మవరానికి, జనాలకు ఏం చేశారో చెప్పాలన్నారు. తాగునీటిని తెప్పించారా, నేతన్నలకు రూ.24వేలు ఇప్పించారా, ఆసుపత్రులు, స్కూల్స్ , బ్రిడ్జిలు కట్టించారా, కనీసం జనాల్లో వారి ముఖాలు చూపించారా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వేముల జయరామిరెడ్డి, వార్డు సచివాలయ కన్వీనర్లు చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార్, కౌన్సిలర్లు బ్రహ్మయ్య, పెనుజూరు నాగరాజు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ఖరీమ్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉడుముల రాము, అమీర్‌బాషా, ఎస్‌పీ బాష, ప్రకాష్ పాల్గొన్నారు.

విద్యతోపాటు విలువలూ ముఖ్యం

- సత్యసాయి బోధనలను అందరూ ఆచరించాలి
- విద్యార్థుల కృతజ్ఞతాపూర్వక కార్యక్రమంలో వక్తలు



నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

పుట్టపర్తి అర్బన్: విద్యతో పాటు విలువలూ ముఖ్యమని, సత్యసాయి విద్యాసంస్థల్లో ఈ మేరకు ప్రమాణాలు పాటిస్తున్నామని సత్యసాయి హయ్యర్ సెకండరీ స్కూల్ ప్రతినిధులు తెలిపారు. శుక్రవారం సత్యసాయి హయ్యర్ సెకండరీ స్కూల్ విద్యార్థులు కృతజ్ఞతాపూర్వక కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. తొలుత ప్రశాంతి నిలయం క్యాంపస్‌లోని విద్యార్థులు సత్యసాయి మహాసమాధిని అందంగా అలంకరింటారు. అనంతరం సత్యసాయిని కీర్తిస్తూ సుమారు గంట పాటు సంగీత కచేరీ నిర్వహించారు. 'సాయి తుమ్‌నే హమేహెపాయ' పేరుతో నాటికను ప్రదర్శించారు. సత్యసాయి బాబాకు కృతజ్ఞతగా విద్యార్థులు సొంతంగా తయారు చేసిన ప్రతిమలు, కేక్‌లు, కార్డులు, మహాసమాధి వద్ద ఉంచి ఆశీర్వాదాలు తీసుకున్నారు.

ప్రతి విద్యార్థీ ఆల్‌రౌండరే..

సత్యసాయి విద్యాసంస్థల్లో చదివే ప్రతి విద్యార్థీ ఆల్‌రౌండరేనని సత్యసాయి హయ్యర్ సెకండరీ స్కూల్ ప్రతినిధులు అన్నారు. తమ సంస్థల్లోని విద్యార్థులకు మెరుగైన విద్య అందించడంతో పాటు ఆటపాటలు, మానవతా విలువలు నేర్పుతామన్నారు. గత ఏడాది 12 తరగతిలో (సీబీఎస్‌ఈ) 114 విద్యార్థులు ఫస్ట్‌క్లాస్‌లో ఉత్తీర్ణులయ్యారన్నారు. మరో 56 మంది విద్యార్థులు 90 శాతం మార్కులు సాధించారన్నారు. తక్కిన విద్యార్థులు డిస్టింక్షన్స్ సాధించారన్నారు. ఫస్ట్ ర్యాంక్ సాధించిన అకుల్‌సింగ్, సెకండ్ ర్యాంకు సాధించిన దివ్యాన్స్ రాథోడ్‌కు కప్పు, ప్రశంసాపత్రాలు అందజేశారు. పదో తరగతిలో 89 మంది విద్యార్థులుండగా అందరూ ఫస్ట్ క్లాస్‌లో ఉత్తీర్ణులయ్యారన్నారు.



సంగీత కచేరీ నిర్వహిస్తున్న విద్యార్థులు

జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు భరోసా

బత్తలపల్లి: ప్రజలందరూ ఆరోగ్యంగా ఉన్నప్పుడే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని భావించే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారని ఎంపీపీ బగ్గిరి త్రివేణి పేర్కొన్నారు. శుక్రవారం డి.చెర్లోపల్లి విలేజ్ క్లినిక్‌లో సర్పంచు గుజ్జల రమాదేవి అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. వైద్యాధికారులు గంగిరెడ్డి, రామకృష్ణలతో పాటు స్పెషలిస్టు వైద్యులు 427 మందికి వైద్య సేవలు అందించారు. ఈఓఆర్డీ దివాకర్, సీఎస్‌డీటీ శారద, కంటి వైద్యులు జయరాములు, ఎంఎల్‌హెచ్‌పీలు శ్రీదేవి, సునిత, శ్రావణి, లిఖిత, ఫార్మసిస్ట్ సరస్వతి, ఏఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు రవీంద్ర, తిరుపాలు, మారుతి, వైఎస్సార్‌సీపీ నేతలు గుజ్జల మునలయ్య, గుజ్జల నారాయణస్వామి, రమణానాయక్ పాల్గొన్నారు.

ఎన్‌పీకుంట: పి కొత్తపల్లి సచివాలయం లో శుక్రవారం వైద్యాధికారులు 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 300 మందికి పైగా రోగులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఇదిలా ఉండగా కార్యక్రమానికి సంబంధించి ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకపోవడంపై వైస్ ఎంపీపీ కేశవరెడ్డి వైద్యాధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

నల్లచెరువు: జగనన్న ఆరోగ్య సురక్ష–2 కార్యక్రమం ప్రజలకు వరమని సర్పంచ్ గంగాదేవి అన్నారు. ఓరువాయి సచివాలయం పరిధిలో శుక్రవారం వైద్యాధికారులు జగనన్న ఆరోగ్య సుర క్ష–2 మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు, ఈ సందర్భంగా రోగులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు నులి పురుగుల నివారణకు అధికారులు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. వైద్యాధికారులు అలేఖ్య,లతా,లావణ్య,నాయక్, సీహెచ్ ఓ రామచంద్రారెడ్డి, హెచ్‌ఏ సూర్యనారాయణరెడ్డి, సూపర్‌వైజర్ సుధాకర్, పంచాయతీ కార్యదర్శి గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

తాడిమర్రి: జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు భరోసా లభిస్తోందని వక్తలు పేర్కొన్నారు. స్థానిక గ్రామ సచివాలయం 2లో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి గోవర్ధన్ నాయుడు, హరిత ఆధ్వర్యంలో గైనకాలజిస్టు కిశోరి, జనరల్ ఫిజీషియన్ ప్రవీణ్ కుమార్ 302 మందికి వైద్య సేవలు అందించారు. ఇందులో ముగ్గురిని శస్త్ర చికిత్సల కోసం కార్పొరేట్ ఆసుపత్రులకు రెఫర్ చేశారు. అనంతరం వారు 9 మంది వృద్ధులకు కంటి అద్దాలు పంపిణీ చేశారు. సచివాలయాల మండల కన్వీనర్ అల్లె సాయినాథ్‌రెడ్డి, ఆప్తాలమిక్ అధికారి సికందర్, ఎంపీహెచ్‌ఈఓ రామ్‌కుమార్ కార్యదర్శి ప్రమీల, వైఎస్సార్ సీపీ నాయకులు బండారు పెద్ద ఓబిలేసు, తాడిమర్రి శ్రీధర్‌రెడ్డి, బొమ్మక ఆదినారాయణరెడ్డి, సిద్దే రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు అల్పాహారం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని బీఎస్ఆర్ మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం పదో తరగతి విద్యార్థులకు దాతల సహకారంతో అల్పాహారాన్ని అందించడం హర్షణీయమని ఎంఈఓ గోపాల్‌నాయక్ తెలిపారు. వార్డు కౌన్సిలర్ కేతా లోకేష్, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ బైముతక రమణ, దాతల సహకారంతో మార్చి 18 వరకు పదో తరగతి విద్యార్థులు సాయంత్రం 4 నుంచి 6గంటల వరకు స్టడీ అవర్స్‌లో అల్పాహారం అందించనున్నారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఎంఈఓ గోపాల్‌నాయక్, కౌన్సిలర్ కేతా లోకేష్, పాఠశాల హెచ్‌ఎం ఉమాపతి ప్రారంభించారు. ఉపాధ్యాయులు రామకృష్ణనాయక్, మహేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులు, సేతు మాధవ్, విద్యార్థులు పాల్గొన్నారు.

11న గుండె వైద్య శిబిరం

ధర్మవరం అర్బన్: ఈనెల 11న హిందూపురంలోని ఆల్ హీ లాల్ పాఠశాలలో ఆత్మీయ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించనున్నామని ట్రస్ట్ చైర్మన్ శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. స్థానిక ట్రస్ట్ కార్యాలయంలో శుక్రవారం శిబిరం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిబిరంలో 2డీ ఎకో, ఈసీజీ, బ్లడ్ షుగర్, బీపీ ఉచితంగా నిర్వహిస్తామన్నారు. యూటీఎఫ్ నాయకులు బాలగొండ్ల శివయ్య, సకల చంద్రశేఖర్, గోపాల్‌రెడ్డి, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

